నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 8 జూన్ 2024 | SIDDIPET

నర్సింగ్ కళాశాల మంజూరు

- భవనాలు, వసతుల కోసం రూ.43 కోట్లు విడుదల

అందోల్, జూన్ 7: వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో అందోల్ పట్టణంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా ఉత్తర్వులు జారీచేశారు. డిసెంబర్‌లో ఎమ్మెల్యేగా ఎన్నికై వైద్యారోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అందోల్ పట్టణంలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటుచేస్తానని దామోదర రాజనర్సింహ వాగ్దానం చేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన అనుమతి ఇచ్చారు. శుక్రవారం కళాశాల ఏర్పాటును ప్రకటిస్తూ భవనాల నిర్మాణం, వసతుల కల్పన కోసం రూ.43 కోట్ల నిధులను మంజూరు చేయడమే కాకుండా వాటిని విడుదల చేశారు. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్‌కు అనుబంధంగా ఏటా 60 మంది విద్యార్థులు చేరేవిధంగా నాలుగేండ్ల బీఎస్సీ (నర్సింగ్)కోర్సు అందోల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానున్నది. మంత్రి దామోదర చొరవతోనే కళాశాల ఏర్పాటైందంటూ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ సత్యనారాయణ, అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతోపాటు కాంగ్రెస్ నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సన్నాల సాగు అంతంతే..!

- అత్యధికంగా దొడ్డు వడ్లు పండిస్తున్న అన్నదాతలు
- సన్నాలకు తెగుళ్ల బెడద ఎక్కువ..దిగుబడి తక్కువ
- పెట్టుబడులు అధికం..రైతుకు నష్టదాయకం
- సన్న వడ్లను సాగుచేస్తే రైతుకు ఎకరాకు రూ.10 వేల వరకు నష్టం
- అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాల్సిందేనని రైతుల డిమాండ్
- మొదలైన వానకాలం సాగు పనులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 20శాతం మాత్రమే సాగు

సిద్దిపేట, జూన్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తాము అధికారంలోకి రాగానే రైతులకు వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికలప్పుడు హామీ ఇచ్చి ఓట్లు డబ్బాలో పడగానే ఇప్పుడు కాం గ్రెస్ సర్కారు కొత్త పల్లవిని అందుకుంది. బోనస్ కేవలం సన్న రకాల వడ్లకు మాత్రమే ఇస్తామని చెబుతున్నది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏటా 80శాతం దొడ్డు రకాలను మాత్రమే రైతులు సాగుచేస్తున్నారు. కేవలం 20శాతం సన్నాలను ఇంటి అవసరాలకు మాత్రమే సాగుచేస్తున్నారు. రైతులకు బోనస్ ఎగనామం పెట్టడానికి ఇలాంటి కొర్రీలు పెడుతున్నదని కాంగ్రెస్ సర్కారుపై విమర్శిలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి సరైన విధానం లేకపోవడంతో వానకాలం సాగుపై రైతులు సందిగ్ధంలో ఉన్నారు. ఒకవైపు సన్నాలకు మాతమే రూ. 500 బోన స్ ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం, దొడ్డు రకాల వడ్ల సాగుపై స్పష్టతను ఇవ్వలేదు. దీంతో ఏమి సాగుచేయాలో తెలియక రైతుల తికమక అవుతున్నారు. వానకాలం, యాసంగి రెండు సీజన్లలోనూ 80శాతం రైతులు దొడ్డు రకం సాగుకే మొగ్గు చూపుతారు. మృగశిర కార్తె ప్రారంభమై రైతులు నార్లు పోసుకుంటారు. కానీ, ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు.

20శాతమే సన్నాల సాగు...

సిద్దిపేట జిల్లాలో గత వానకాలంలో 3,32,006 ఎకరాలు, యాసంగిలో 3,48,009 ఎకరాలు వరి సాగుచేశారు. మెదక్ జిల్లాలో గత వానకాలంలో 3,00,967,గత యాసంగిలో 1,85,295 ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో గత వానకాలంలో 1,04,000ఎకరాలు, యాసంగిలో 1,03,000ఎకరా ల్లో రైతులు వరి సాగు చేశారు. దీంట్లో 80శాతం దొడ్డు రకాలే వడ్లే సాగుచేశారు. కేవలం 20శాతం మేర మాత్రమే సన్నాలు సాగు చేశా రు. వానకాలం కన్నా యాసంగిలో మరి తక్కువగా సన్నాలు సాగు చేస్తారు. ఎందుకంటే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు నీటిఎద్దడి ఉంటుంది. దీంతో గింజ పగిలిపోతుంది. నూకలు ఎక్కువగా వస్తా యి. ఫలితంగా వానకాలం కన్నా యాసంగిలో సన్నరకాల వడ్లు తక్కువగా సాగుచేస్తారు. రైతులు ప్రతి సాగులో సన్న రకాల కన్నా దొడ్డు రకాల వడ్ల సాగుకే ఎక్కువ మొగ్గు చూపుతారు. ఎందుకంటే పంట దిగుబడిలో సన్నాల కంటే దొడ్డురకం వరి దిగుబడి ఎక్కువగా వస్తుంది. సన్నరకాలకు చీడపీడల బెడదతోపాటు నీటి వసతి ఎక్కువ కావాలి. పంటకాలం కూడా నెల ఎక్కువగానే ఉంటుంది. దొడ్డు రకానికి సన్న రకానికి ఎంత లేదన్నా నెలరోజుల తేడా వస్తుంది. వర్షాలు అధికంగా పడితే సన్న రకాల వడ్లు తడిసితే బియ్యం ముక్కి పోతుంది. ఇవన్నీ తట్టుకొని సన్నాలను పండించాల్సి వస్తుంది. దొడ్డు రకాలకు అంత ఇబ్బంది ఏమి ఉం డదు. పైగా పంట దిగుబడి ఎక్కువ వస్తుంది. పంట కాలం కూడా తక్కువగానే ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దొడ్డు, సన్నం అనే తేడాలు లేకుండా అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని రైతులు డిమాం డ్ చేస్తున్నారు. సన్నాలకు మార్కెట్‌లో డి మాండ్ ఉన్న పంట అని చెప్పవచ్చు. క్వింటాల్‌కు డిమాండ్‌ను బట్టి రూ.2500 నుంచి రూ.3 వేల వరకు పలుకుతుంది. అదే దొడ్డు వడ్లకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.2,203, కామన్ గ్రేడ్ వడ్లకు రూ.2,183 చెల్లిస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలలో వరి సాగు ఎకరాల్లో (2022-23)

జిల్లా	గత వానకాలం (సాగు చేసింది)	గత యాసంగి (సాగు చేసింది)	ప్రస్తుత వానకాలం (సాగు అంచనా)
సిద్దిపేట	3,32,006	3,48,009	3,00,000
మెదక్	3,00,967	1,85,295	3,27,113
సంగారెడ్డి	1,40,000	1,03,000	1,50,000
మొత్తం	7,72,973	6,36,304	7,77,113

దిగుబడి తక్కువ ..పెట్టబడులు ఎక్కువ

సన్న రకం వడ్ల సాగుకు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. దిగుబడి తక్కువగా వస్తుంది. పైగా నీటి వసతి ఎక్కువ, పంట కాలం సైతం నెల రోజులు ఎక్కువగా ఉంటుంది. చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న సన్న రకాల విత్తనాల ప్రకారం ఎకరాకు తెలంగాణ సోనా 20 నుంచి 23 క్వింటాళ్లు, బీపీటీ 20 క్వింటాళ్ల వరకు, జై శ్రీరాం 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దొడ్డు రకం వరి దిగుబడితో సన్నరకం వడ్లను పోల్చితే దిగుబడిలో 5 నుంచి 8 క్వింటాళ్ల వ్యత్యాసం ఉంటుంది. దొడ్డు రకం వడ్ల దిగుబడి ఎక్కువ వస్తుంది. ఎకరాకు ఎంత లేదన్నా సరాసరిగా 25 నుంచి 28 క్వింటాళ్ల వరకు దొడ్డు రకం వరి దిగుబడి వస్తుంది. ఫలితంగా రైతులు దొడ్డు రకం సాగును ఎంచుకుంటున్నారు. సన్నరకం వడ్లను సాగు చేయడంతో పంటకాలం ఎక్కువ అవుతుంది. దిగుబడి తక్కువ వస్తుంది. ఫలితంగా ఎకరాకు ఎంత లేదన్నా రైతు సుమారుగా రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు నష్టపోతాడు. ప్రకృతి విపత్తులను సన్నాలు ఎక్కువగా తట్టుకోవు. అందుకే ఎక్కువ మంది రైతులు సన్నాల సాగు ఆసక్తి చూపరు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని అన్ని వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలే..

ఎన్నికల ముందు ఎట్లయితే రైతులు పండించిన వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెసోళ్లు చెప్పిరో చెప్పినట్లుగానే ఇయ్యాలే. గిప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం మాట తప్పడమే. కాంగ్రెసోళ్లు మాట నిలబెట్టుకోవాలి. లేకపోతే కాంగ్రెస్‌ను రైతులు ఎప్పుడూ నమ్మరు. ఏ గవర్నమెంట్ ఉన్నా రైతులను మంచిగ చూసుకుంటనే అందరికీ బాగుంటది.

–బండారి యాదగిరి, రైతు, గురువన్నపేట (సిద్దిపేట జిల్లా)

సన్నవడ్ల సాగుకు పెట్టుబడి ఎక్కువ..

సన్నరకం వడ్లు పండిస్తే దిగుబడి తక్కువ వస్తది. తెగుళ్లు ఎక్కువ ఆశిస్తయి. పెట్టుబడులు బాగా అయితయి. దొడ్డు రకం వడ్ల పండిస్తే దిగుబాడి బాగా రావడంతోపాటు తెగుళ్లను తట్టుకుంటుంది. రైతులు పండించిన అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలే. సన్నరకం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సర్కారు అనడం సరికాదు. రైతులను ఆదుకోవాలి.

–మల్లం నర్సింహులు, రైతు, ఐనాపూర్(సిద్దిపేట జిల్లా)

సన్నాలు వేస్తే దిగుబడి తక్కువస్తుంది..

దొడ్డు రకం వరి 5 నెలల ప్రారంభంలోనే పంట చేతికొస్తుంది. రొడ్డు రకం వరికి అగ్గితెగులు వంటి ఏరోగం వచ్చినా తట్టుకునే శక్తి ఉంటుంది.దిగుబడి కూడా అధికంగా వస్తుంది. సన్నరకం వరి పంట చేతికి రావాలంటే పూర్తిగా ఆరు నెలల టైం కచ్చితంగా పడుతుంది.నీటి తడులు ఎక్కువ అందియ్యాలి. ఖర్చు ఎక్కువే. ఏదన్నా రోగం వచ్చిందా పంట మొత్తం నాశనమవుతుంది. దిగుబడి రాక రైతులు మరింతా అప్పులు పాలైతరు. సన్నవడ్లకు మాత్రమే రూ.500 ఇస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఆలోచన చెయ్యాలి.వాళ్లు ఇచ్చే రూ.500 లకు ఒక్క పాస్పేట్ సంచి కూడారాదు.

– ఎల్లయ్య, రైతు, నిజాంపేట(మెదక్ జిల్లా)

ఎవుసం అంటే మాటలు కాదు..

వరి వేసిన ప్రతి రైతుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీ ఎలక్షన్లు అయిన తెల్లారి నుంచే సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పుతున్నారు. మాట మార్సుడు గీ కాంగ్రెసోళ్లకు మంచిది కాదు. ఎవుసం చేసుడు అంటే మాటలు కాదు. పెట్టుబడులు బాగా పెరిగినయి. కాలం అనుకూలించక పోతే పంటలు దెబ్బతిని రైతులు అప్పుల పాలవుతారు.

–బక్కోల్ల లస్మయ్య,
రైతు, రజాక్‌పల్లి, నిజాంపేట మండలం (మెదక్ జిల్లా)

నిరాధార ఆరోపణలు తగవు

గజ్వేల్‌లో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు

- సీఎం స్థాయిని తగ్గించుకొని మాట్లాడొద్దు
- గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకోవద్దు
- విలేకరుల సమావేశంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 7: సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయిని తగ్గించుకొని నిరాధారణమైన మాటలు మాట్లాడవద్దని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హితవు పలికారు. శుక్రవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సిద్దిపేటలో బీఆర్ఎస్ ఓట్లను బీజేపీకి డైవర్ట్ చేశారని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి, మహబూబ్‌నగర్, మల్కాజిగిరిలో కాంగ్రెస్ ఓట్లను బీజేపీకి డైవర్ట్ చేశారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, మాట్లాడే ముందు తామేమీ చేశామో గుర్తు చేసుకోవాలన్నారు. ఏపీ ప్రజలు చంద్రబాబుకు ఇచ్చిన తీర్పును, తెలంగాణ ప్రజలు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతిస్తే ఢిల్లీలో కేసీఆరే కీలకం అయ్యేవారన్నారు. ఎల్లప్పుడు రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకోవద్దని, పెండింగ్‌లో ఉన్న రూ.200కోట్ల నిధులు ఇవ్వడంతోపాటు రింగ్‌రోడ్డు, బస్టాండ్లు, రేడియల్ రోడ్లు, యూజీడీ పనులు పూర్తికి నిధులి ఇవ్వాలని కోరారు. తాము అధికారం ఉన్నా లేకున్నా ప్రజలతోనే ఉంటామన్నారు. రైతాంగం కోసం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులను నింపాలని, వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గజ్వేల్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి మద్దతిచ్చారని వారికి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మెట్టయ్య, చందు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, నర్సింగరావు, విరాసత్‌అలీ, భూపాల్‌రెడ్డి, పొన్నాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ' పనులు పూర్తి చేయాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, జూన్ 7: అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఈడబ్ల్యూ ఐడీసీ ఇంజినీర్లు, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద జిల్లాలో 814 పాఠశాలల్లో విద్యుత్, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిషన్ షెడ్లు, ప్రహరీల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం కావడానికి 5 రోజుల సమయం మాత్రమే ఉన్నా, కేవలం 176 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తికావడంతో అసహనం వ్యక్తం చేశారు. చివరిదశలో ఉన్న పాఠశాలల్లో రంగులు పూర్తిచేసి 12వ తేదీలోగా సిద్ధం చేయాలన్నారు. మిగతా పాఠశాలల్లో ఈనెల 20వ తేదీలోగా వందశాతం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పూర్తిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమీక్షలో పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు, ఏఈలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 7: మెదక్ జిల్లాలోని యువతీ, యువకులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. పథకంలో భాగంగా భారత వైమానికదళం అగ్నివీర్ వాయు పేరుతో నియామకాలు చేపట్టిందన్నారు. శుక్రవారం సంబంధిత పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు 3 జూలై 2004, 3 జనవరి 2008 మధ్య జన్మించి ఉండాలన్నారు. అభ్యర్థులు ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హతతోపాటు గణితం, భౌతిక శాస్త్రం, ఇంగ్లిష్ చదివి ఉండాలన్నారు. ఇంగ్లిష్‌లో 50శాతం మార్కులతోపాటు మొత్తం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. అభ్యర్థులు agnipathvayu. cdac.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు, డీఈవో రాధాకిషన్, ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ, వైమానికదళ అధికారులు పాల్గొన్నారు.

పట్టా సర్టిఫికెట్ల కోసం లబ్ధిదారుల ఆందోళన

గజ్వేల్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, జూన్ 7: గజ్వేల్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఆరు నెలల కింద లక్కీడ్రా పద్ధతిలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హులను ఎంపిక చేసిన అధికారులు నేటికీ పట్టా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదంటూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. అంతకుముందు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిని కలిసిన బాధితులు తమ సమస్యను విన్నవించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టగా సీఐ సైదా సిబ్బందితో అక్కడికి చేరుకొని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా సర్టిఫికెట్లు ఇవ్వడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిని కలువగా, ఆందోళనకారుల వద్దకు చేరుకొని మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్యతో సమస్య పరిష్కారం కోసం చర్చించిన అనంతరం ఎమ్మెల్సీ లబ్ధిదారులతో మాట్లాడుతూ వచ్చే వారంలో కలెక్టర్‌ను లబ్ధిదారులతో నేరుగా కలిసి సమస్యను వివరించి పట్టా సర్టిఫికెట్లు ఇప్పించేలా కృషి చేస్తానని సమాధానం చెప్పడంతో ఆందోళన విరమించారు.

విమర్శలు మాని అభివృద్ధి చేయాలి

నర్సాపూర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి
- ప్రజాతీర్పును శిరసా వహిస్తున్నాం..
- ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు భవన నిర్మాణాలకు నిధులు తేవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ మారాడు.. అది మర్చిపోయారా
- ప్రతి శుక్రవారం నర్సాపూర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటా
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జూన్ 7: కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షాలను విమర్శించడం మానేసి అభివృద్ధిపై దృష్టి సారించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హితవు పలికారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓటేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా తీర్పును శిరసా వహిస్తున్నామని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నదని, గతంలో కంటే 2.34 శాతం ఓట్లు తగ్గాయనే విషయాన్ని గ్రహించాలని ఎద్దేవా చేశారు. ప్రాంతీయ పార్టీలతో పొత్తున్న స్థానాల్లోనే బీజేపీ గెలిచిందని, పొత్తులేని స్థానాల్లో ప్రాంతీయ పార్టీలు దెబ్బతిన్నాయని అన్నారు. అసలైన నాయకులు ఇతర పార్టీల నాయకులను గౌరవించాలని, వ్యక్తిగత విమర్శలు చేయవద్దని హెచ్చరించారు. తనపైనా, కేసీఆర్‌పైనా, హరీశ్‌రావుపైన విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకులకు మంచిది కాదని మండిపడ్డారు. సమస్యలపై అధికార పార్టీ స్పందిస్తలేదని, కేవలం విమర్శలకే సరిపోయిందని అన్నారు. పార్టీ మారారని స్థానిక కాంగ్రెస్ నాయకులు తనపై పదేపదే విమర్శలు చేసేముందు, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని పార్టీలు మారి కాంగ్రెస్‌లోకి వచ్చాడనే విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. పార్టీ మారిన నాయకులను పక్కన కూర్చోబెట్టుకొని దీని గురించి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. తాను పార్టీ మారి ఐదేండ్లు అవుతుందని, ప్రజలు తనన్ను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. అధికారంలో ఉన్నాలేకున్నా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాడుతుందని వెల్లడించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాలలకు శాశ్వత భవనాలు లేవని, వాటిని నిర్మించడానికి కృషి చేయకుండా బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమని కాంగ్రెస్ నాయకులను సునీతాలక్ష్మారెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని కాంగ్రెస్ నాయకులు అనే ముందు, మోదీ తెలంగాణ వచ్చినప్పుడు బడేబాయ్ చోటేబాయ్ అని ముఖ్యమంత్రి అన్న విషయాన్ని మర్చిపోవద్దని చురకలంటిచారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గానికి రూ.200 కోట్లు ఎస్‌డీఎఫ్ వచ్చాయని, కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వాటిని తిరిగి మంజూరు చేపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని చురకలంటించారు. ఇక మీదట తాను ప్రతి శుక్రవారం నర్సాపూర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యం గౌడ్, నాయకులు సూరారం నర్సింహులు, జీవన్‌రెడ్డి, సేనాధిపతి, ఆంజనేయులు, కరుణాకర్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలోమృగశిర సందడి

మృగశిర కార్తె సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో సందడి నెలకొంది. రోహిణిలో వేడెక్కిన శరీరం చల్లబడేందుకు మృగశిర కార్తె రోజు చేపలు తినాలనేది ఆనవాయితీగా వస్తున్నది. సంగారెడ్డి మార్కెట్‌కు చేపలు భారీగా రావడంతో జనం ఎగబడ్డారు. వ్యాపారులకు గిరాకీ బాగున్నా... కొనుగోలుదారులకు మాత్రం చేపల ధరలు చుక్కలు చూపించాయి. కిలో రూ.450 నుంచి రూ.600 వరకు అమ్మడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. అయినా మృగశిర కార్తె రోజు చేపలు తినాలని రేటు ఎక్కువైనా కొనుగోలు చేశారు. – సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, జూన్ 7